# నగ్నదృశ్యాలు

రచన :
సుబ్బారావుశాస్త్రి

ఫుట్-పాత్ మీద నుంచున్ని మాట్లాడుతున్న యిద్దరి వ్యక్తుల్లో ఆవల నుంచున్న స్థూలకాయుణ్ని ఎరుగని వారుండరేమో...! ఆయన గొప్ప రాజకీయవేత్త, బీదలపాలిట కల్పవృక్షం!

"ఏమోనండీ! ఈ రోజుల్లో ప్రతీవాడూ, ప్రజలూ, ప్రజలకోసం అనడమూ ప్రజలనోట మన్ను కొట్టేవాడేగాని, అసలు ప్రజలగురించి పాటుపడేదెవరండీ?-మాయింట్లో యిద్దరు కుర్రాళ్ళున్నారు. ఒహడు ఇంటర్, మరోహడు స్కూల్ ఫైనలూ చదువుతున్నారు. వాళ్లకి తల్లి తండ్రీ యెవరూ లేరుట! పోనీ మా అబ్బాయిల్తో చదువుతారని, మా యింట్లోనే వుండమన్నాను...! తర్వాత వాళ్లకి రెక్కలు రాగానే వాళ్ళే పోతారు...!"

"అవును మరి! మీవంటి వాళ్లెవరో వుండబట్టి ప్రపంచ యిలాగన్నా వుంది! లేకుంటే యెప్పుడో.'

'ఎబ్బే! అదే మన్నమాట...! మొన్న మా పెద్ద సెలవులకు వచ్చాడు. వాడు యిలానే...స్టేషన్ దగ్గర పావలా యిస్తానని తీసుకువచ్చాడట రిక్షావాణ్ని...! వాడు మరో బేడ యివ్వమంటే, వాడితో పేచీ పెట్టుకు కూర్చున్నాడు. ఓ బేడ డబ్బుల్లో మనం చెడిపోయేదేముంది?...బేడా పారేశాను!"

"రిక్షావాళ్లు వట్టి పేచీకోర్లండీ!...ఆ! సరే, కాని టైమ్ తొమ్మిదయ్యింది! సాయంత్రం క్లబ్బులో కలుసుకుందాం!" అన్నాడు వాచీ చూస్తూ మొదటివ్యక్తి.

"అయితే వెళ్ళొస్తాను...! నమస్కారం..."

"నమస్తే!" మొదటవ్యక్తికూడా చెయ్యివిసిరి వెళ్లిపోయాడు.

"బాబూ...! రిక్షా...!" అన్నాడు నాగులు కర్రరిక్షాపుచ్చుకు. "రత్నమహల్ తెలుసా?" అని అడిగాడు స్థూలకాయుడు.

"తెల్సుబాబూ!" అనగానే ఆ స్థూలకాయుడు రిక్షాయెక్కిపోయాడు. "ఏమిస్తారు బాబూ?" అనబోయి కటుక్కున నాలుక కొరుక్కుని రిక్షాయెత్తుకున్నాడు నాగులు.

సైకిలు రిక్షాలు వచ్చినతర్వాత కర్ర రిక్షాలు పూర్తిగా పడిపోయాయి! నాగులు అంతకు ముందు రోజు రిక్షాఅద్దెకూడా కట్టలేదు. ఇంట్లోపరిస్థితి చాలా కష్టంగావుంది. ఇళ్ళల్లో అందరికీ చలిజ్వరాలూ, దగ్గులూ! తిండిలేదు.

"ఏమిస్తారో!" అనుకున్నాడు మనసులో—ఒకరోజు ఒకసందులోంచి ఖాళీగా వస్తున్నాడు. ఒక టోపీవాలా రిక్షాతో యెక్కాడు. 'ఏమిస్తారు?' అని అడిగాడు నాగులు. దాంతో వెంటనే ఆ టోపీవాల "బ్రూట్..." అని యింకాఏదో తిట్టుకుంటూ రిక్షా దిగి వెళ్లిపోయాడు. అందుకే ఆ స్థూలకాయుణ్నికూడా "ఏమిస్తారు?" అని అడగలేదు.

"త్వరగా పోనీరా! తిండితినలేదూ?" కటువుగా అన్నాడు స్థూలకాయుడు. తిండితిన్నా, తినకపోయినా రిక్షాలోవున్నది 'ఆబోతు' అయితే నా...!

నాగులు వేగం హెచ్చించాడు. అప్పటికి మూడు మైళ్ళు లాగేశాడు. ఇంకా రెండుమైళ్ళు లాగాలి!

ఎంత తీక్షణంగావుంది. విశాఖపట్నం తారు రోడ్డుమీద కాళ్ళు అంటుకుంటున్నాయి...! రోడ్లన్నీ హెచ్చు తిగులు...! పైకిలాగాడం, క్రిందకి పట్టుకోవడం...!

రిక్షా పెద్ద భవనం ముందు ఆగింది. స్థూలకాయుడుదిగి జేబులోనుంచి రెండుఅర్థణాకాసులు, చేతులోపడేసి గబగబా వెళ్లిపోయాడు.

స్థూలకాయుడికి ఘూర్ఖా సాల్యూట్ కొట్టేడు. నాగులు చెమట తుడుచుకొని, డబ్బులు లెక్కచూసుకునేలోగా వెళిపోయాడు స్థూలకాయుడులోపల్కు...!

"బాబూ...!" అన్నాడు నాగులు. బాబు... ఇంకెక్కడ, మేడమీదకు వెళిపోయాడు...!

లోపలకు వెళ్తున్న నాగుల్ని "అరె! జావ్... జావ్" అని ఘూర్ఖాకర్రతో వెనక్కునెట్టేశాడు.

"పోతా...బాబూ... పోతా...!" అంటూ నాగులు రిక్షాయెత్తుకున్నాడు.—